సాక్షి
మెదక్
శనివారం : 29 : ఏప్రిల్ : 2023



పాముకాటుతో బాలుడి మృతి
ఇంటి వరండాలో నిద్రిస్తున్న ఓ బాలుడిని పాము కాటేసింది. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. IIలో



ఆన్‌లైన్ మోసాలు..!
ఆన్‌లైన్ మోసగాళ్లు లింకులు పంపి నగదు కాజేస్తున్నారు. అత్యాశతో డబ్బు రెట్టింపు చేసుకోవాలనుకునే వారు ఎక్కువగా ఈ మోసాలకు గురవుతున్నారు. IIలో

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ
మెదక్ కలెక్టరేట్: ఉమ్మడి జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతకు ఐదు నెలల ఫౌండేషన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు టీఎస్ స్టడీ సర్కిల్ హైదరాబాద్ డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో వివిధ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణతో పాటు భోజనం, వసతి కల్పిస్తామన్నారు. వివరాలకు 040-23546552, 7989332923 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అన్నదాత వరిగోస



చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లిలో శుక్రవారం ఉదయం కురిసిన వర్షానికి తడిసిన ధాన్యం

- వెంటాడుతున్న అకాల వర్షాలు
- మొలకెత్తుతున్న ధాన్యం
- పూర్తిస్థాయిలో ప్రారంభం కాని కొనుగోళ్లు

మెదక్‌జోన్: అకాల వర్షాలు అన్నదాతను అతలాకుతలం చేస్తున్నాయి. ఇప్పటికే తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతుండగా.. అవి ఆరేలోపే మళ్లీ వర్షం పడుతుంది. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొన్ని చోట్ల ధాన్యం మొలకెత్తగా.. శుక్రవారం తెల్లవారుజామున మళ్లీ చిరుజల్లులు పడ్డాయి. దీంతో రైతులు కోలుకోలేకపోతున్నారు.

జిల్లావ్యాప్తంగా ఈ యాసంగిలో ఇప్పటివరకు నాలుగు సార్లు కురిసిన అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దయింది. గత మంగళవారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి ధాన్యం నీటిలో కొట్టుకుపోగా కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. అనేక ఇబ్బందులు పడి తడిసిన ధాన్యాన్ని రైతులు ఆరబెడుతుండగా శుక్రవారం తెల్లవారుజామున మళ్లీ చిరుజల్లులు పడ్డాయి. ఈ యాసంగిలో జిల్లావ్యాప్తంగా 1.98 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా అందుకు గానూ 4.43 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందుకు గానూ 420 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటించినప్పటికీ కొనుగోళ్ల ఏర్పాటులో జాప్యం జరిగింది. ఇప్పటివరకు కనీసం 50 కొనుగోలు కేంద్రాలను సైతం ఏర్పాటు చేయలేదు. గోనె సంచులు లేకపోవడంతోనే ఆలస్యం జరుగుతున్నట్లు తెలిసింది. అంతే కాకుండా టార్పాలిన్లు ఒక్కో కేంద్రానికి కేవలం 5 నుంచి 10 వరకు మాత్రమే పంపిణీ చేశారు. ఇవి కూడా గతంలో పంపిణీ చేసినవి.. ఈసారి కొత్తగా ఏమి కొనలేదని ఓ అధికారి తెలిపారు. కాగా త్వరతగతిన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం తూకం వేయాలని రైతులు కోరుతున్నారు.

పగలు ఎండ.. రాత్రి వాన

ఈఏడాది మార్చి నుంచి వాతావరణంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మధ్యాహ్నం వేళల్లో 40 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా.. సాయంత్రం, రాత్రి వేళల్లో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వర్షం కురుస్తుంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునే దశలో ఇబ్బంది పడతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతు



కొండముచ్చు ట్రాఫిక్ పోలీస్ అవతారమెత్తింది. మెదక్ పట్టణంలోని బస్‌డిపో వద్ద గల చౌరస్తాలో పోలీసులు ట్రాఫిక్ పాయింట్ ఏర్పాటు చేశారు. శుక్రవారం కొండముచ్చు అరగంటకు పైగా అందులో నిలబడి వచ్చిపోయే వాహనాలను చూస్తుండగా 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది. అటుగా వెళ్తున్న వాహనదారులు ఆశ్చర్యంగా చూస్తూ, నవ్వుతూ ముందుకు సాగారు. – మెదక్‌జోన్

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

అల్లాదుర్గం(మెదక్)/ నిజాంపేట: 161 జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని.. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని అధికారులకు సూచించారు. శుక్రవారం అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గడిపెద్దాపూర్ నుంచి పెద్దశంకరంపేట మండలం జంబికుంట వరకు 161 రహదారిపై ప్రమాదాల స్పాట్‌లను పరిశీలించారు. అనంతరం అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్‌లో హైవే అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎక్కడెక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయో అక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్న వారికి అవగాహన కల్పిస్తే కొంత మేర ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో అల్లాదుర్గం సీఐ జార్జ్, ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి, నేషనల్ హైవే హెడ్ ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిజాంపేట పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

రోడ్డును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది



రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): శీలాంపల్లి నుంచి అంతారం గేటు వరకు వేసిన బీటీ రోడ్డు నాణ్యత బాగుందని రాష్ట్ర క్వాలిటీ కంట్రోలర్ అండ్ విజిలెన్స్ అధికారి పుల్లారావు అన్నారు. శుక్రవారం మండలంలోని సామ్లా తండా వద్ద పీఎంజీఎస్‌వై రోడ్డు పనులను పీఆర్‌డీఈ అమరేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా పీఆర్‌డీఈ మాట్లాడుతూ.. 6.7 కోట్ల నిధులతో శీలాంపల్లి, అంతారం రోడ్డు పనులు పూర్తయ్యాయని.. రోడ్డును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదన్నారు. ముఖ్యంగా రైతులు నూతన రోడ్డుపై దమ్ము చక్రాలతో ట్రాక్టర్ నడిపి ధ్వంసం చేయొద్దని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌ఏఈ మధుబాబు, కాంట్రాక్టర్ రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

నర్సాపూర్: అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కాటేజీల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయించాలని డీఎఫ్‌ఓ రవిప్రసాద్ ఆదేశించారు. నర్సాపూర్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో అర్బన్ పార్క్ పక్కన నిర్మిస్తున్న కాటేజీల పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయా పనులు త్వరగా పూర్తి చేయించాలని ఎఫ్‌ఆర్‌ఓ అంబర్‌సింగ్‌ను ఆదేశించారు. కాటేజీల చుట్టూ ఏర్పాటు చేస్తున్న ఫెన్సింగ్ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. పనుల్లో జాప్యం లేకుండా చూడాలని పేర్కొన్నారు.

వేసవి శిబిరం ఆకస్మిక తనిఖీ

నర్సాపూర్: నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల ఫైన్ ఆర్ట్స్ పాఠశాల, కాలేజీలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంపును రాష్ట్ర గిరిజన గురుకుల ఓఎస్‌డీలు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమ్మర్ క్యాంపులో భాగంగా పలు అంశాలపై శిక్షణ ఇస్తుండగా ఆయా విభాగాలను ఓఎస్‌డీలు శ్రీనివాస్‌కుమార్, సుమలత తనిఖీ చేశారు. ఆయా విభాగాల్లో కొనసాగుతున్న శిక్షణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరిశీలించారు. శిక్షణ వివరాలను ప్రిన్సిపాల్ భిక్షమయ్య, అసిస్టెంట్ క్యాంపు కోఆర్డినేటర్ చార్లెస్, ఉపాధ్యాయులు వెంకటయ్య, సుదేంద్ర, మధు, తదితరులు ఓఎస్‌డీలకు వివరించారు.

శంభో శివ శంభో



మెదక్ రూరల్: గరుడ గంగ మంజీరా తీరం శివనామస్మరణలతో మార్మోగుతుంది. శుక్రవారం మంజునాథ స్వామికి మంజీరా నదిలో అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పుష్కర ఘాట్ వద్ద పుణ్య స్నానాలు ఆచరించి గంగమ్మకు వాయినాలు సమర్పించారు.

కొనుగోళ్లు ముగిసే వరకు సెలవులు ఇవ్వొద్దు



గోదాం ఇన్‌చార్జిలతో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ రమేశ్

అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ధాన్యం సేకరణ ముగిసే వరకు ఎవరికీ సెలవులు మంజూరు చేయవద్దని అదనపు కలెక్టర్ రమేశ్ స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్‌తో కలిసి మండలస్థాయి గోదాం ఇన్‌చార్జిలు, పౌర సరఫరాల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ దుకాణాలకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయడంతో పాటు ప్రతి నెల త్వరగా చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని 7 మండలస్థాయి స్టాక్ పాయింట్లలో నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అన్ని రికార్డులు, అకౌంట్ ఎంట్రీ సక్రమంగా నిర్వహించాలన్నారు. నిల్వ ఉన్న స్టాక్, రిజిస్టర్లకు ఎలాంటి తేడా రాకుండా చూడాలన్నారు. ధాన్యం సేకరణ ముగిసే వరకు కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచుల కొరత రాకుండా మానిటరింగ్ చేయాలన్నారు. గోదాంలలో పనిచేసే సిబ్బందికి, హమాలీలకు వెంటవెంటనే డబ్బులు చెల్లించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి చోటు లేకుండా చూడండి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

రామాయంపేట(మెదక్): ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఎలాంటి అవినీతికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అధికారులకు సూచించారు. నార్సింగి మండల కేంద్రంలో శుక్రవారం ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ కంపెనీ (ఎఫ్‌పీసీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. వర్షాలతో రైతులు దిగులు చెందకుండా త్వరగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించాలని సూచించారు. రైతులకు మెరుగైన సేవలు అందించడానికి ప్రైవేట్ ఆర్గనైజేషన్లను కేంద్రం ప్రోత్సహిస్తుందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. గుర్తింపు పొందిన రైతు సంఘాల పేరిట జిల్లాలో నాలుగు సొసైటీలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సంఘం చైర్మన్ బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్, నార్సింగి సర్పంచ్ ఎర్రం అశోక్, తహసీల్దార్ సత్యనారాయణ, డైరెక్టర్లు పరశురాం, స్వరూప, జ్యోతి, సోమరాజు, స్వామి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల డిమాండ్లు పరిష్కరించాలి

మెదక్ కలెక్టరేట్: బంగారు తెలంగాణలో కేసీఆర్ కుటుంబానికే తప్ప ఏ ఒక్కరికి న్యాయం జరగలేదని బీజేపీ రాష్ట్ర నాయకుడు నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ విమర్శించారు. కలెక్టరేట్ ఎదుట గత 12 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న వీఓఏలకు శుక్రవారం మద్దతు తెలిపి మాట్లాడారు. వీఓఏలకు ప్రమాద బీమా కల్పించడంతో పాటు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివకుమార్, సతీష్, సంగీత, లావణ్యతో పాటు సంఘం జిల్లా అధ్యక్షుడు సాయాగౌడ్, ప్రధాన కార్యదర్శి స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మురళీ యాదవ్



సమ్మెలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

జేపీఎస్‌ల సమ్మె ప్రారంభం

మెదక్ కలెక్టరేట్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం సమ్మె ప్రారంభించారు. ప్రభుత్వం స్పందించే వరకు ఉద్యమిస్తామంటూ కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుమార్, ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం తమను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. పని ఒత్తిడి తట్టుకోలేక ఎంతో మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒత్తిడి తట్టుకొని లక్ష్యాన్ని పూర్తి చేసిన తమను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సంతోష్, బండి రమేష్, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమాలు

మెదక్‌జోన్: భారతదేశ సామాజిక విప్లవానికి సారధులుగా నిలిచిన మహాత్మా జ్యోతిబా పూలే, అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికే మహనీయుల జన జాతర చేపట్టినట్టు కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమేల మాణిక్యం అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ద్వారకా గార్డెన్‌లో జన జాతర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ సర్కార్ అనుసరిస్తున్న విధానాలు రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి దోహదం చేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడం ద్వారా బడుగు, బలహీన వర్గాల రిజర్వేషన్లను సమాధి చేస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

మెదక్ కలెక్టరేట్: అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త హంగులు

మెదక్ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలను కార్పొరేట్ ప్లే స్కూల్స్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. శుక్రవారం హవేళీఘణాపూర్ మండలం బ్యాతోల్ గ్రామంలో నిర్మించిన మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. అలాగే గ్రామం పచ్చదనం, పరిశుభ్రతను సంతరించుకోవడంపై సర్పంచ్‌ను అభినందించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ పాండురంగారెడ్డి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి



ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆత్మీయ సమ్మేళనంలో వక్తలు

మెదక్ మున్సిపాలిటీ: చట్టబద్ధతతో కూడిన రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు చర్యలు చేపడుతామని ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని వెంకటేశ్వర గార్డెన్‌లో నిర్వహించిన రెడ్ల ఆత్మీయ సమ్మేళనంలో వారు పాల్గొని మాట్లాడారు. విదేశీ విద్యా నిధి పథకం పేద రెడ్ల పిల్లలకు అందేలా చర్యలు చేపడుతామన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పూర్తిస్థాయిలో అమలయ్యేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో పేద విద్యార్థుల కోసం రెడ్డి హాస్టల్ నిర్మాణానికి ప్రయత్నిస్తామన్నారు. హైదరాబాద్‌లో రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి భవనం కోసం ప్రభుత్వం రూ.10 కోట్లు కేటాయించిందని తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, ప్రొఫెసర్ బాణపురం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద రెడ్ల అభ్యున్నతికి తమవంతుగా కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నందు జనార్దన్‌రెడ్డి, నందారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, పీసీసీ నాయకులు ఆవుల రాజిరెడ్డి, సోమన్నగారి రవీందర్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, రెడ్డి సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు సంతోష్‌రెడ్డి, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వరి సాగులో మనమే ముందంజ

రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్‌సింగ్

మెదక్ కలెక్టరేట్: దేశంలో అత్యధికంగా వరి పండించే రాష్ట్రంగా తెలంగాణ మారబోతుందని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్‌సింగ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, రమేశ్, రైస్ మిల్లుల సంఘం అధ్యక్షుడు చంద్రపాల్, డీఎస్‌ఓ శ్రీనివాస్, పాక్స్ చైర్మన్ హనుమంతరెడ్డితో సమీక్ష నిర్వహించారు. కంట్రోల్ రూంలో టీవీ ఏర్పాటు చేయడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అత్యవసర వార్తలకు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మెదక్ మండలం రాజ్‌పల్లిలో ప్రాథమిక సహకార సంఘం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. జిల్లాలో 2014లో 1,400 రైస్ మిల్లులు ఉండగా నేడు 2,700 రైస్ మిల్లులు ఏర్పడ్డాయని కలెక్టర్ రాజర్షిషా రవీందర్‌సింగ్‌కు వివరించారు. జిల్లాలో 3 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. ప్రతి రైస్ మిల్లర్ ఒక పాఠశాలను దత్తత తీసుకోవాలని కోరారు.



ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్, అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న రవీందర్‌సింగ్

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి: కలెక్టర్

వివిధ పథకాల కింద మెదక్, రామాయంపేట మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్లు అనుమతుల కోసం వేచి ఉండకుండా టెండర్లు ఆహ్వానించి పనులు మొదలు పెట్టాలని సూచించారు.

కోచ్‌ల నియామకం

మెదక్ కలెక్టరేట్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశానుసారం జిల్లాలో 14 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు 14 మంది కోచ్‌లను నియమించినట్టు తెలిపారు. వీరికి రూ. 4 వేల చొప్పున వేతనంతో పాటు క్రీడా సామగ్రి అందజేస్తామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

బోసిపోయిన తహసీల్‌



జనసందోహం లేని ములుగు తహసీల్దార్‌ కార్యాలయం

ములుగు(గజ్వేల్‌): ములుగు తహసీల్దార్‌ కార్యాలయంలో అవినీతికి అడ్డూఅదుపు లేకుండా పోయిందనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. విసిగిపోయిన ఓ బాధితుడు ఏసీబీని ఆశ్రయించడం, ఆర్‌ఐ రూ. 50,000 తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన విషయం తెలిసిందే. పౌతీలు, మ్యుటేషన్లు, కరెక్షన్లకు కూడా సిబ్బంది డబ్బులు డిమాండ్‌ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంతోఇంతో ముట్టజెప్పక పోతే నెలల తరబడి తిప్పించుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. ఏసీబీ దాడుల ఘటన తర్వాత శుక్రవారం ములుగు తహసీల్దార్‌ కార్యాలయం బోసిపోయి కనిపించింది.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్‌ సీఐ ప్రవీణ్‌ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకెన్‌ డ్రైవ్‌ లో 14 మంది పట్టుబడ్డారు. వారిని సంగారెడ్డి కోర్టులో శుక్రవారం హాజరుపర్చగా జడ్జి 14 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించారు.

సంగారెడ్డిలో...

సంగారెడ్డి టౌన్‌ : డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసులో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌లో నలుగురిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా జడ్జి ఒక్కొక్కరికి 2000 రూపాయల చొప్పున జరిమానా, ఏడు రోజులు జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు తెలిపారు.

మోటారును ఎత్తుకెళ్లిన దొంగలు

నర్సాపూర్‌ రూరల్‌: తాగునీటి సరఫరాకు వినియోగించే మోటారును దొంగలు ఎత్తుకెళ్లారు. మండలపరిధిలోని పెద్దచింతకుంటలో శుక్రవారం ఈ ఘటన వెలుగుచూసింది. సర్పంచ్‌ గుండె శివకుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ చెరువు పక్కన ఉన్న గ్రామపంచాయతీ బోరు నుంచి గుర్తుతెలియని దొంగలు మోటర్‌, పైపులు దొంగలు ఎత్తుకెళ్లారు.ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి

అక్కన్నపేట(హుస్నాబాద్‌): పిడుగు పడి ఓ ఎద్దు మృతి చెందింది. సర్పంచ్‌ దినేష్‌రెడ్డి చెప్పిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని చౌటకుంట తండాలోని వ్యవసాయ క్షేత్రంలో రైతు మాలోతు స్వామి ఎద్దును కట్టేశాడు. గురువారం అర్ధరాత్రి పిడుగుపడి ఆ ఎద్దు మృతి చెందింది. దీని విలువ రూ.65000 ఉంటుందని బాధిత రైతు వాపోయాడు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పటాన్‌చెరుటౌన్‌: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..పట్టణంలోని బస్టాండ్‌ వెనుకాల శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి పడుకున్న చోటే మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వయస్సు 45 సంవత్సరాలు ఉంటుందని, పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురి మృతి

ఉమ్మడి జిల్లాలో శుక్రవారం వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందగా, మరో ఆరుగురు గాయపడ్డారు.

బైక్‌ను ఢీకొన్న లారీ ఘటనలో మహిళ



మన్నే లక్ష్మి మృతదేహం

సదాశివపేట(సంగారెడ్డి): బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఓ మహిళ అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ఎస్‌ఐ సుదర్శన్‌ తెలిపిన వివరాల ప్రకారం ...పట్టణ పరిధిలోని ప్రియదర్శిని కాలనీలో నివాసముంటున్న మన్నే లక్ష్మి(47) శుక్రవారం సాయంత్రం సదాశివపేటకు మనుమడు ముకుంద, మనుమరాలు లహరీతో కలిసి బైక్‌పై సదాశివపేటకు వచ్చింది. తిరిగి ప్రియదర్శినికాలనీకి వెళుతుండగా, జహీరాబాద్‌ నుంచి వస్తున్న లారీ వైజంక్షన్‌ వద్ద ఢీకొట్టింది. ఈ ఘటనలో లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందగా, బైక్‌పై ఉన్న ముకుంద, లహరిలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు శివకుమార్‌ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్‌ బోల్తా పడి రైతు..

మద్దూరు(హుస్నాబాద్‌): ట్రాక్టర్‌ అదుపుతప్పి ఓ రైతు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని లద్నూర్‌కు చెందిన నంద ఎల్లయ్య(46) శుక్రవారం సాయంత్రం హార్వెస్టర్‌తో వరికోత కోయిస్తున్నాడు. వడ్లను ట్రాక్టర్‌ ట్రాలీలో పోసుకున్నారు. డ్రైవర్‌ సంపత్‌ బండి నడుపుతుండగా, ఎల్లయ్య పక్కన కూర్చొని వెళుతున్నారు. ఈ క్రమంలోనే ట్రాక్టర్‌ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎల్లయ్య ట్రాక్టర్‌ కిందద పడి అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలైన సంపత్‌ను చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. మృత్యుడికి భార్య, కూతురు ఉంది. ఎస్‌ఐ నారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిజామాబాద్‌ వాసి..

రామాయంపేట(మెదక్‌): పట్టణ శివారులో జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంతో ఒక వ్యాపారి మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. నిజామాబాద్‌ జిల్లా కేంద్రంలో వ్యాపారం చేస్తున్న శికారి నర్సింగ్‌షా అతని భార్య బాలమణి, మనవడు విశాల్‌ కారులో హైదరాబాద్‌ వెళుతుండగా ఈప్రమాదం జరిగింది. డ్రైవర్‌ గోపి అతి వేగం, అజాగ్రత్తగా కారు నడుపుతూ, రామాయంపేట శివారులో జాతీయ రహదారిపై వెనుక నుంచి డీసీఎంను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ముందు సీటులో కూర్చున్న నర్సింగ్‌షా తీవ్రగాయాలతో మృతిచెందగా, వెనుకసీటులో కూర్చున్న అతని భార్య, మనవడికి కూడా తీవ్రగాయాల య్యాయి. 108లో బాధితులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ రంజిత్‌ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నర్సింగ్‌షా మృతదేహం



డీసీఎంను ఢీకొన్న కారు



శేఖర్‌ మృతదేహం



కుత్బుద్దీన్‌ మృతదేహం

హత్నూరలో ఇద్దరు..

హత్నూర(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కుత్బుద్దీన్‌, సోహెల్‌లు మెదక్‌ జిల్లా తూప్రాన్‌లోని సిమెంటు పలకల తయారీ పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం దౌల్తాబాద్‌ నుంచి సంగారెడ్డి వైపు బైక్‌పై వెళుతూ, ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను నస్తీపూర్‌ బస్‌స్టేజి సమీపంలో సంగారెడ్డి - నర్సాపూర్‌ ప్రధాన రహదారిపై ఢీకొట్టారు. ఈ ఘటనలో కుత్బుద్దీన్‌(19), సోహెల్‌తో పాటు మరో బైక్‌పై ఉన్న శేఖర్‌(22)కు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో నర్సాపూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడికి చేరుకునే లోపే కుత్బుద్దీన్‌, శేఖర్‌లు మృతి చెందారు. సోహెల్‌కు మెరుగైన చికిత్స అందిచడానికి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. మృతుడు శేఖర్‌ది పటాన్‌చెరు మండలం పెద్ద కంజర్ల. రెండు బైకులు అతివేగంగా రావడంతోనే ఈ ఘటన చోటుచేసుకుందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

చెట్టును ఢీకొన్న బైక్‌



ఒగ్గు సత్య నారాయణ (ఫైల్‌)

రామాయంపేట(మెదక్‌): మండలంలోని లక్ష్మాపూర్‌ గ్రామశివారులో శుక్రవారం రాత్రి బైక్‌ అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో అక్కన్నపేట గ్రామానికి చెందిన ఒగ్గు సత్యనారాయణ (43) అక్కడిక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ రంజిత్‌ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్‌ ఢీకొని..

చేర్యాల(సిద్దిపేట): మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ ఢీకొని వ్యక్తికి గాయాలయ్యాయి. జాతీయరహదారి విస్తరణ పనులకు కొద్దిరోజులుగా మట్టిని తరలిస్తున్నారు. మండల పరిధిలోని చుంచనకోట శివారులో శుక్రవారం డ్రైవర్‌ టిప్పర్‌ను అజాగ్రత్తగా నడుపుతూ బస్టాండ్‌ సమీపంలో పోన్నబోయిన పెద్ద సిద్దులును ఢీకొట్టాడు. దీంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

దొరికిన బంగారాన్ని అప్పగించిన యువకుడు

అభినందించిన డీసీపీ శిల్పవల్లి

రామచంద్రాపురం(పటాన్‌చెరు) రోడ్డుపై దొరికిన బంగారాన్ని ఓ యువకుడు పోలీసులకు అప్పజెప్పిన సంఘటన శుక్రవారం రామచంద్రాపురంలో జరిగింది. శుక్రవారం సాయంత్రం మాదాపూర్‌ డీసీపీ శిల్పవల్లి ఆ వివరాలు వెల్లడించారు. బీరంగూడ సాయికాలనీలో నివాసం ఉండే సాఫ్ట్‌వేర్‌ఉద్యోగి సాయిస్వరూప్‌ వివాహ నిశ్చితార్థం ఏపీలోని కాకినాడలో ఈనెల 26వ తేదీన జరిగింది. గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి బస్సులో బీరంగూడ చౌరస్తాలో దిగాడు. ఆ తర్వాత బంగారు ఆభరణాలు ఉన్న సూట్‌కేసును రోడ్డుపైనే మరిచిపోయి ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో భారతీనగర్‌ డివిజన్‌ ఎంఐజీ కాలనీకి చెందిన నరేందర్‌గౌడ్‌ రోడ్డుపై ఉన్న సూట్‌కేసును గమనించి దానిని తెరిచి చూశాడు. అందులో బంగారు ఆభరణాలు ఉండటంతో వెంటనే 100 డయల్‌ చేసి విషయం తెలియజేశాడు. అనంతరం స్థానిక పోలీసులకు సమాచారం అందించి బంగారాన్ని పోలీసులకు అప్పగించాడు. సూట్‌కేసు పోయిందని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. పోయిన బంగారం దొరకడంతో సాయిస్వరూప్‌ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. దొరికిన బంగారం ఉన్న సూట్‌కేసు(సుమారు 20 తులాలు) అందించిన నరేందర్‌గౌడ్‌ను డీసీపీ శిల్పవల్లి శాలువకప్పి అభినందించారు. ఈ సమావేశంలో ఏసీపీ నరసింహారావు, ఇన్‌స్పెక్టర్‌ సంజయ్‌, డీఐ ప్రతాప్‌ లింగం, ఎస్‌ఐ శశికాంత్‌ రెడ్డి, పోలీస్‌ సిబ్బంది ఉన్నారు.



నరేందర్‌ గౌడ్‌ను సన్మానిస్తున్న డీసీపీ శిల్పవల్లి. చిత్రంలో దొరికిన బంగారు ఆభరణాలు

బాంబు అనుకోని భయపడ్డారు: నరేందర్‌ గౌడ్‌

బీరంగూడ చౌరస్తాలోని జాతీయరహదారిపై సూట్‌కేస్‌ ఉండటంతో అక్కడ ఉన్న వారు అందులో బాంబు ఉందంటూ భయపడ్డారు. నేను ధైర్యంగా ముందుకు వెళ్లి సూట్‌కేస్‌కు తెరిచి చూడగా బంగారు ఆభరణాలు ఉన్నాయి.

డయల్‌ యువర్‌ ఆర్‌ఎంకు స్పందన

సంగారెడ్డి టౌన్‌ : ఆర్టీసీ నిర్వహించిన డయల్‌ యువర్‌ ఆర్‌ఎం కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. శుక్రవారం ఆర్‌ఎం సుదర్శన్‌ ఈ కార్యక్రమానికి ప్రారంభించారు.

- యాదుల మాట్లాడుతూ ముప్పారం నుంచి జోగిపేటకు ఉదయం సమయంలో విద్యార్థులు వెళ్లేందుకు బస్సులు నడపాలన్నారు.
- చౌటకూరు నుంచి సత్యనారాయణ మాట్లాడుతూ మండల కేంద్రంలో ఎక్స్‌ప్రెస్‌ బస్సులను నిలపాలన్నారు.
- శివంపేట నుంచి రమేష్‌ మాట్లాడుతూ సర్వీస్‌ రోడ్డు నుంచి బస్సులను నడపాలన్నారు.
- బస్వాపూర్‌ నుంచి అరవింద్‌ మాట్లాడుతూ పోచారం నుంచి పుల్కల్‌, బస్వాపూర్‌ మీదుగా జోగిపేటకు బస్సు సర్వీసులను నడపాలని కోరారు.అనంతరం ఆర్‌ఎం మాట్లాడుతూ ప్రయాణికుల నుంచి వచ్చి కాల్స్‌ త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఏదుమైలారం నుంచి శంకర్‌ మాట్లాడుతూ ఊరికి ప్రత్యేక బస్సును వేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

పాముకాటుతో బాలుడి మృతి



అక్షయ్‌ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు. ఇన్‌సెట్‌లో అక్షయ్‌ (ఫైల్‌)

కొల్చారం(నర్సాపూర్‌): ఇంటి వరండాలో నిద్రిస్తున్న ఓ బాలుడిని పాము కాటేసింది. గుర్తించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గబ్బర్‌ సింగ్‌-సునీత దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు. గబ్బర్‌సింగ్‌ది మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి తండా స్వస్థలం కాగా, భార్యపిల్లలను వారి పుట్టినిల్లయిన జలాలార్‌పూర్‌ తండాలో ఉంచి బతుకుదెరువుకు వలస వెళ్లాడు. సునీత తండ్రి చందర్‌ ఇటీవల ఇంటినిర్మాణ పనులు మొదలుపెట్టాడు. దీంతో పక్కనే ఉన్న మరో ఇంట్లో నివాసముంటున్నారు. గురువారం అర్ధరాత్రి కరెంటుపోయింది. ఉక్కపోతగా ఉండడంతో తల్లితోపాటు చిన్నకుమారుడు అక్షయ్‌(5) ఇంటి వరండాలో నిద్రించారు. శుక్రవారం తెల్లవారుజామున ఐదుగంటల ప్రాంతంలో అక్షయ్‌ని పాముకాటు వేసింది. గమనించిన కుటుంబసభ్యులు ముందుగా అంసాన్‌పల్లికి తీసుకెళ్లారు. అక్కడి ఆర్‌ఎంపీ సూచన మేరకు మెదక్‌ తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందాడు.

విద్యుదాఘాతంలో కూలీ ..

పటాన్‌చెరు టౌన్‌: విద్యుదాఘాతంతో ఓ కూలీ మృతి చెందిన ఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. ఒడిశాకు చెందిన త్రినాథరావు(50) మూడేళ్ల క్రితం వలస వచ్చి మూసాపేటలోని బంధువుల ఇంట్లో ఉంటూ కూలీగా పనిచేస్తున్నాడు. శుక్రవారం బీరంగూడ పరిధిలోని జయలక్ష్మినగర్‌ కాలనీలో తాపీమేస్త్రీ రాజుతో కలసి భవన నిర్మాణ పనుల్లో భాగంగా కట్టెలు కట్టేందుకు వచ్చాడు. ఈ క్రమంలో కట్టెను పైకి లేపగా విద్యుత్‌ వైర్‌ తగిలింది. కరెంట్‌ షాక్‌తో త్రినాథరావుకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం బీరంగూడ కమాన్‌ సమీపంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

చేగుంట(తూప్రాన్‌): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని కరీంనగర్‌ తండా నుంచి శుక్రవారం రాత్రి విఠల్‌నాయక్‌ బైక్‌పై చేగుంట వైపుకు వస్తున్నాడు. ఈక్రమంలో ఇబ్రహీంపూర్‌ వైపుకు బైక్‌పై వెళుతున్న దొరగొల్ల ఎల్లం చేగుంట శివారులోఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో విఠల్‌ కాలికి దెబ్బ తెగలగా, ఎల్లంకు తీవ్ర గాయాలయ్యాయి. ఎల్లంను హైద రాబాద్‌కు తరలించారు. విఠల్‌ను స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రిలో చేర్పించారు.

నేడు లింగాయత్‌ భవన శంకుస్థాపన



మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న వీరశైవ లింగాయత్‌లు

సంగారెడ్డి మున్సిపాలిటీ: వీరశైవ లింగాయత్‌ భవన శంకుస్థాపనకు శనివారం హాజరుకావాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావును వీరశైవ లింగాయత్‌ నాయకులు శుక్రవారం మంత్రిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎహెచ్‌ చైర్మన్‌ మల్కాపురం శివకుమార్‌, వీరశైవ లింగాయత్‌ రాష్ట్ర నాయకులు రామప్ప, సిద్ధేశ్వర్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు ఆత్మకూరు నాగేష్‌, జగదీశ్వర్‌, మాజీ ఎంపీపీ బాబు పటేల్‌, చౌటకూరు మండల్‌ బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు శివకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యాచకుడి మృతి

గజ్వేల్‌రూరల్‌: భిక్షాటన చేసే ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ జీవిస్తున్న 65ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి ఆస్పత్రి ఆవరణలోని మార్చురీ వద్ద పడి ఉన్నాడు. ఆస్పత్రి సిబ్బంది పరిశీలించగా మృతి చెందినట్టు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మృతుడి ఒంటిపై ఎరుపురంగు టీషర్ట్‌, బూడిదరంగు ప్యాంట్‌ ఉన్నాయని, ఆచూకీ తెలిసిన వారు గజ్వేల్‌ పోలీసులను సంప్రదించాలన్నారు.

కుటుంబ కలహాలతో...

మనోహరబాద్‌(తూప్రాన్‌): కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చెట్ల గౌరారం గ్రామానికి చెందిన రావెల్లి దశరథ(58) చిన్న కోడలుకు చెందిన బంగారాన్ని అమ్మగా వచ్చిన డబ్బు ఖర్చు చేశాడు. ఈ విషయమై ఇంట్లో గొడవ జరుగుతుండగా, చిన్నకోడలు కుటుంబసభ్యులు నోటీసులు పంపించారు. దీంతో గురువారం ఇంట్లోంచి వెళ్లిపోయాడు. గ్రామ శివారులోని చెట్టుకు ఉరి వేసుకొని దశరథ ఆత్మహత్య చేసుకున్నాడన్న సమాచారం శుక్రవారం అందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీధర్‌ తెలిపారు.




దశరథ(ఫైల్‌)


అనుమానాస్పదస్థితిలో వ్యక్తి..

మునిపల్లి(అందోల్‌): అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మండల పరిధిలోని తాటిపల్లి గ్రామానికి చెందిన బి.రమేశ్‌ (22) గురువారం సాయంత్రం బయటకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాలేదు. బంధువులు, తెలిసినవారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం మధ్యాహ్నం మన్సాన్‌పల్లి గ్రామ శివారులో చెట్టుకు వేలాడుతూ రమేశ్‌ మృతదేహం కనిపించింది. కుటుంబసభ్యులు బుదేరా పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సదాశివపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రమేశ్‌ తండ్రి బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కూతురు సహా తల్లి అదృశ్యం



మమత



అవంతిక(ఫైల్‌)

వర్గల్‌(గజ్వేల్‌): కూతుర సహా తల్లి అదృశ్యమైంది. గౌరారం ఎస్‌ఐ సంపత్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం... చౌదరిపల్లికి చెందిన బీద రాజుకు భార్య మమత, ఐదేళ్ల కూతురు అవంతికఉన్నారు. ఎనిమిది నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన రాజు మంచానికి పరిమితమయ్యాడు. గురువారం మధ్యాహ్నం భర్త రాజు, అత్త నాగవ్వలు మమతతో గొడవపడ్డారు. దీంతో ఆమె తన కూతురును తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. వారి కోసం బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం మమత తల్లి ఐలమ్మ ఫిర్యాదు మేరకు మిస్సింగ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్నేహితురాలి ఇంటికి వెళుతున్నానని చెప్పి..

పటాన్‌చెరు టౌన్‌: స్నేహితురాలి దగ్గరికి వెళుతున్నానని చెప్పిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బీరంగూడ పరిధిలోని ఓ కాలనీకి చెందిన యువతి(24) గురువారం స్నేహితురాలి వద్దకు వెళుతున్నానని ఇంటి నుంచి బయటకు వెళ్లింది.తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికిన ఆచూకీ లభించలేదు. శుక్రవారం కూతురి అదశ్యంపై తల్లి ఫిర్యాదు చేయగా, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌ మోసాలు..!

- రూ. కోట్లలో నష్టం
- ఫోన్‌కాల్‌ లింకులు, ఓటీపీ ఎంటర్‌ చేస్తే అంతే
- బ్యాంకు ఖాతాలనుంచి నగదు డెబిట్‌
- అపరిచిత వ్యక్తుల పరిచయాలతో ఇబ్బందే..

జిన్నారం(పటాన్‌చెరు): ఆన్‌లైన్‌ మోసాలంటే ఈ రోజుల్లో సర్వసాధారణంగా తయారైంది. ఫోన్‌, కంప్యూటర్‌ ఇలా నెట్‌ ఉంటే చాలు. అందులో ఆన్‌లైన్‌ మోసగాళ్ల హవా కొనసాగిస్తున్నారు. లింకులు పంపి మరీనగదు కాజేస్తున్నారు. ఈ విషయంలో జాగ్రత్తగా ఉంటే మోసాల బారినుంచి తప్పించుకోవచ్చు. ఆన్‌లైన్‌ మోసగాళ్లు రూ. వేలనుంచి లక్షల్లో ఆశచూపిస్తున్నారు. అమాయక ప్రజలు, డబ్బు రెట్టింపు చేసుకోవాలనే వారే ఎక్కువగా ఈ మోసాలకు గురవుతున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో దేశంలోని ఆయా ప్రాంతాల వారు ఇక్కడ నివాసం ఉంటున్నారు. వారు వివిధ రకాల పరిశ్రమల్లో పనులు చేసుకుంటున్నారు. ఇక్కడ కార్మికులు, వ్యాపారులు, తరువాతి స్థానంలో చదువుకున్న యువకులే ఎక్కువగా ఉన్నారు. రియల్‌ వ్యాపారం సైతం ఈ ప్రాంతంలో ఎక్కువే. ఆన్‌లైన్‌లో తక్కువ ఫీజుతో ఎంబీఏ సీట్లు ఇస్తున్నట్టుగా ఎరవేస్తున్నారు. ఈ విషయంలో చదువుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్టు లేదా లాటరీ గెల్చుకున్నారనో, తక్కువధరకే మీ ఇంటి వద్దకు ఎలక్ట్రానిక్‌ వస్తువులనో, ఇళ్లు, దుకాణాల పన్నులు కట్టలేదనో ఇలా ఆన్‌లైన్‌లో మోసాలకు పాల్పడుతున్నారు. ఏది ఏమైనా గుర్తు తెలియని వ్యక్తుల మాటలను నమ్మొద్దు. మీకు లాభం చేకూరుతుందని కొన్ని లింకులను ఫోన్‌లో గుర్తు తెలియని వ్యక్తులు పంపుతుంటారు. అలాంటి వాటికి యువత ఆకర్షితులవుతూ మోసపోతున్నారు. వచ్చిన లింకులను ఓపెన్‌చేసి సదరు వ్యక్తికి లింకుకు సంబంధించిన మెసేజ్‌ చేరవేస్తున్నారు. దీంతో వారు రూ. వందల్లో, వేలల్లో, లక్షల్లో మోసానికి గురవుతున్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్‌)

- సామాన్య ప్రజలు సైతం తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తున్నాయని ఆశకు గురై, అలాంటి ఆఫర్‌లకు ఆకర్షితులవుతున్నారు. ఇలా డబ్బులను పోగొట్టుకుంటున్నారు.
- మరికొంతమంది రియల్‌ వ్యాపారాలకు ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టి మోసాల బారిన పడుతున్నారు.

మోసాల తీరు ఇలా..

- బొంతపల్లి గ్రామానికి చెందిన అఖిల్‌గౌడ్‌ అనే విద్యార్థి ఎంబీఏ సీటు కోసం బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తితో పరిచయం పెంచుకొని తక్కువ ధరకే సీటు వస్తుందని చెప్పడంతో సదరు వ్యక్తికి రూ.70లక్షలు పంపించాడు.
- అన్నారం గ్రామానికి చెందిన రియల్‌ వ్యాపారి నరహరి వ్యాపార నిమిత్తం ఆన్‌లైన్‌లో ఓ వ్యక్తితో పరిచయం చేసుకున్నాడు. యూకేలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని చెప్పి నాలుగేళ్ల నుంచి రూ.1.18కోట్లను ఆన్‌లైన్‌ద్వారా మని ట్రాన్స్‌ఫర్‌ చేశాడు. ఆ వ్యక్తి రెస్పాండ్‌ కాకపోవడంతో నష్టపోయానని గుర్తించాడు.
- ఇంద్రేశం గ్రామానికి చెందిన జ్ఞానరాజు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌కి స్పందించి ఆన్‌లైన్‌లో ఫోన్‌కు వచ్చిన లింకుతో ఏకంగా రూ.14.76లక్షలను పోగొట్టుకున్నాడు.
- ముత్తంగి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఆన్‌లైన్‌లో లోన్‌ ఇపిస్తామని చెప్పడంతో ఆ మాటలు నమ్మిన సదరు వ్యక్తికి వచ్చిన ఫోన్‌లింకులను ఓపెన్‌ చేయగా రూ. 2.40లక్షలు నష్టపోయాడు. ఆన్‌లైన్‌లో వచ్చిన లింకులుగానీ, గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన ఓటీపీ వంటి వాటిని ఓపెన్‌చేయొద్దు. ఎవరికీ మెసేజ్‌లు పంపక పోవడమే ఉత్తమం అని పలువురు అంటున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



ఆన్‌లైన్‌ మోసాలకు సంబంధించి కేసులు ఈ మధ్య ఎక్కువగానే నమోదవుతున్నాయి. యువత ఈ విషయంలో అప్రమత్తంగా ఉండడమే మేలు. ఫోన్‌కాలర్‌ నుంచి వచ్చిన ఎలాంటి లింకులను ఓపెన్‌ చేయొద్దు. ఈ విషయంపై మేము అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నాం.

–విజయకృష్ణ, గుమ్మడిదల ఎస్‌ఐ